# ప్రజాజ్యోతి
నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 25 | మార్చి | 2025 | పేజీలు: 4


## నీటి సమస్యను పరిష్కారం చూపని
# అధికారులు

**చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న పంచాయితీ కార్యదర్శి**

**త్రాగునీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్థులు**



2

## నీటి సమస్య ఉంటే
# వెంటనే ఫోన్ చేయండి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి మార్చి 24.గ్రామీణ, పట్టణ ప్రాంతంలో త్రాగు నీటి సమస్య ఉంటే వెంటనే కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన త్రాగునీటి మానిటరింగ్ సెల్‌కు ఫోన్ చేసి సమస్య వివరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి సమస్య తలెత్తినపుడు కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన




మానిటరింగ్ సెల్ నెంబర్ 9908712421 కు కాల్ చేసి తెలియజేయవచ్చునని తెలిపారు. ఈ మానిటరింగ్ సెల్ ప్రతీ రోజు ఉదయం గం.10-30 నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందని, అట్టి సెల్ ద్వారా త్రాగు నీటి సమస్యను పరిష్కరించుకోవచ్చుని తెలిపారు. సమస్యకు సంబంధించిన వివరాలును నమోదు చేసుకొని సంబంధిత పంచాయతీ, మిషన్ భగీరథ అధికారులకు,సిబ్బందికి తెలియపరచి సమస్యను పరిస్కరించబడుతుందని పేర్కొన్నారు. అట్టి సెల్ ను కలెక్టర్ సోమవారం సాయంత్రం పరిశీలించి తగు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళీ, తదితరులు పాల్గొన్నారు.



## పీడీఎస్ బియ్యం పట్టివేత

**ప్రజాజ్యోతి నిజామాబాద్ క్రైమ్:** అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్ పెక్టర్ అంజయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నగరంలోని వీక్లీ మార్కెట్ లోని శ్రీ సాయి కిరాణా షాప్ పై టాస్క్ ఫోర్స్ ,స్పెషల్ పార్టీ సిబ్బంది ఆధ్వర్యంలో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో 20 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ బియ్యం విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. దుకాణ యజమానికి తదుపరి చర్యల నిమిత్తం వన్ టౌన్ ఎస్‌ఎచ్‌ఓకు అప్పగించినట్లు తెలిపారు.

## పంచాయతీ కార్మికుల జీతాలు
# వెంటనే చెల్లించాలి




**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:**తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టి యు సి ఐ) ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి యు సి ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ రమేష్,జిల్లా నాయకులు బి.మురళిమాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,750 గ్రామపంచాయతీలో 60 వేల మందికి పైగా పంచాయతీ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని వారికి గత ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ కార్మికులకు ప్రతి నెల 5వ తారీఖు లోపు జీతాలు ఇస్తామని హామీ ఇచ్చి 18 నెలలు గడుస్తున్న ఇంతవరకు కార్మికులకు జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గత ..మిగతా 2లో



# ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌కు టీజీఓ సంఘం వినతి పత్రం

ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: టీజీఓ సంఘం ఆధ్వర్యంలో వివిధ ఎన్నికలలో విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు,అధికారులకు ఒక నెల గౌరవ వేతనంను వెంటనే ఇప్పించాలని టీ.జి.ఓ. సంఘం అధ్యక్షులు అలుక కిషన్,కార్యదర్శి అమృత్ కుమార్ సోమవారం నిజామాబాద్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్ సానుకూలంగా స్పందించారు. వెంటనే సెక్షన్ ఆఫీసర్‌తో ఈ విషయాన్ని సమీక్షించి, ఆలస్యం చేయకుండా ప్రధాన ఎన్నికల అధికారి కి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో తీసుకున్న త్వరిత చర్యను తాము అభినందిస్తున్నామన్నారు. అదనంగా కలెక్టర్ కాంప్లెక్స్‌లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడానికి ఐడీఓసీలో సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ మరొక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ చొరవ ఇంధన సామర్థ్యం, స్థిరమైన పాలనా పద్ధతులకు దోహదం చేస్తుందన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం కలక్టరేట్ ప్రాంగణంలో వాహనాలు నిలుపు స్థలం (పార్కింగ్) గురించి ఆందోళనలను లేవనెత్తామనితెలిపారు. ఇక్కడ వాహనాలు ప్రస్తుతం చాలా వేడి పరిస్థితులలో సరైన షెల్టర్ లేకుండా పార్క్ చేయబడుతున్నాయన్నారు. ఈ అసౌకర్యాన్ని మెరుగుపరచడానికి వాహనాలకు తగిన రక్షణ కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఉద్యోగుల ప్రయోజనం కోసం ఈ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవి సింగ్, చందర్, దండు స్వామి, గంగాధర్, రామస్వామి, గోవర్ధన్,కీర్థిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

మొదటి పేజీ తరువాయి...

పోరాటాల ఫలితంగా జనవరి నెల నుండి కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల 5వ తారీఖున జీతాలను వారి ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు హామీని అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. కార్మికులకు ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ గా 5 లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగుల తరహా 30 శాతం పి ఆర్ సి అమలు చేయాలని జీవో నెంబర్ 51 సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారంగా 16,500 వేతనాన్ని ఇవ్వాలి జన శ్రీ బీమాను వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ జిల్లా నాయకులు సత్యమ్మ, నాయకులు అరవింద్, రాజేశ్వర్, పంచాయతీ కార్మికులు మహేష్, రాము, ,చింటూ, సురేష్, బాలు, నరేష్, గంగాధర్, భోజన్న, నరేష్, శ్రీకాంత్, రమేష్, లింగం, రాజేశ్వర్, భోజన్న, సాయిలు,దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణరంగ కార్మిక సంఘం (టీయుసీఐ) రాష్ట్ర 3వ మహాసభ పోస్టర్లను టీయుసీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్, కోటగల్లి వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత కరువైందన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులందరికీ లేబర్ కార్డులు అందించాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను పెంచాలన్నారు. కార్మికులందరికీ బైకులను అందజేయాలన్నారు. ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలను ఆపాలన్నారు. సంక్షేమ బోర్డులో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవడం రాష్ట్ర మహాసభలో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటారన్నారు. ఈనెల 25న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ ప్రగతిశీల భవన %డ% ఇతర నిర్మాణరంగ కార్మిక సంఘం (టి యు సి ఐ) రాష్ట్ర 3వ మహాసభను జయప్రదం చేయాలని జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయుసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, నాయకులు పి.రవి, డి.కిరణ్, సాయన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిరాజ్ కళాశాల ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలి

## కలెక్టర్ కు పిడిఎస్ యు వినతి



ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: గిరిరాజ కళాశాల ఎస్సి హాస్టల్ కు నూతన భవన నిర్మించాలని జిల్లా కలెక్టర్ కు పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారం రాజేశ్వర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజేశ్వర్ మాట్లాడుతూ గిరిరాజ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఎస్సీ హాస్టల్ చాలా సంవత్సరాల క్రితం కట్టిందని , శిధిల వ్యవస్థకు చేరుకొని పైఉచ్చులు ఉడుతూ విద్యార్థులపై పడుతున్నటువంటి పరిస్థితి నెలకొందని, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న పరిస్థితి ఉంది, వెంటనే నూతన బిల్డింగ్ మంజూరు చేసి సమ్మర్ లో పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిజామాబాద్ నగరంలో వేలమంది ఎస్సీ విద్యార్థులు వివిధ రకాల చదువులు చదువుతున్నారని , ప్రస్తుతం ఎస్సీ పోస్ట్ మెట్రిక్ బాయ్స్ విద్యార్థులకు రెండు హాస్టల్ మాత్రం ఉన్నాయని, హాస్టల్ సౌకర్యం లేనందువలన విద్యార్థులు ప్రైవేట్ హాస్టల్స్, రూములలో ఉంటున్నారని కావున మరొక ఎస్సీ హాస్టల్ ఎస్సి(సి ) కట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నాయకులు మనోజ్, సాయికిరణ్,గౌతం, చరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్యను పరిష్కారం చూపని అధికారులు

సదాశివానగర్,మార్చి24(ప్రజాజ్యోతి): సదాశివ నగర్ మండలంలోని భూంపల్లి గ్రామంలో త్రాగునీటి కొరతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామా పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెల్లిన చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో నీరు కావాలంటే గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బోరు వద్ద నుండి నీళ్లు తెచ్చుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెల్లిన గ్రామపంచాయతీలో నిధులు లేవని ఎక్కడినుండి నిధులు తేవాలని విడ్డురణగా సమాధానం ఇస్తున్నారన్నారు. గ్రామంలో నీటి సమస్య మరియు 7వ వార్డులో నీటి సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెల్లిన ఆమె చూసి చూడనట్టుగా వ్యవహరిస్తుందని గ్రామస్తులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు గ్రామ సమస్యలు పట్టని విధంగా భూంపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ వ్యవహరిస్తుందని వారు వాపోతున్నారు ఏడో వార్డులో నీటి సమస్య లేకుండా ఒక పైప్ లైన్ దవ్వించి నీటి సమస్య పరిష్కరించాలని వివరించగా ఆమె సమాధానం చెప్పకుండా గ్రామ పంచాయతీలో నిధులు లేవని మాత్రమే చెప్పడం గమనార్ధం భూంపల్లి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్ మరియు పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక దృష్టి సాధించి ఏడో వార్డులో నీటి పైపు దవ్వించి ప్రజల దాహం తీర్చాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన కొందరు పంచాయతీ కార్యదర్శులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు పంచాయతీ కార్యదర్శులు ప్రతి నీటి వసతులపై అవగాహన ఉండాలని కలెక్టర్ వివరించినా కానీ కొందరు పంచాయతీ కార్యదర్శి లో తీరు మారడం లేదు తాగునీటి సమస్యలు రాకుండా చూడవలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిలపై ఉందని కలెక్టర్ గ్రామాలలో ఉన్న ట్యాంకర్ అందుబాటులోకి తీసుకురావాలని ఏమైనా మరమ్మత్తులు ఉంటే చేయించాలని సూచించిన భూంపల్లి పంచాయతీ కార్యదర్శి కలెక్టర్ చెప్పిన వాటికి వ్యతిరేకంగా ఉంది భూంపల్లి గ్రామంలో ఉన్న ఊరడి చిన్న పెంటయ్య బోరు వద్ద నుండి తాగడానికి మంచినీరు బైకులపై ట్రాక్టర్ల పై తీసుకురావడం జరుగుతుంది ఏడో వార్డులో నీటి సమస్య ఉందని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెల్లిన కానీ మీరు ఫస్ట్ మీ గ్రామం నుండి డబ్బులు పెట్టుకోండి బిల్లు రాగానే నేను ఇప్పిస్తానని చెప్పడం గమనార్ధం ఒక గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇలా మాట్లాడడం పై గ్రామస్తులు చర్చించుకుంటున్నారు గ్రామంలో నీటి సమస్య పరిష్కరించడంలో విఫల్లమైతున్న భూంపల్లి పంచాయతీ కార్యదర్శి పై తగ్గిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

# ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఫైర్ సేఫ్టీ అవగాహన సదస్సు






కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి మార్చి 24. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం ఫైర్ సేఫ్టీ పైన అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి జిల్లా డీఎఫ్ఓ సుధాకర్ సర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులకు అగ్ని ప్రమాద అగ్నిప్రమాదం పైన నివారణ మరియు జాగ్రత్తలపై పలు సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా వంటగదిలో సిలిండర్ ని ఉపయోగిస్తున్న సమయంలో సమయంలో ఏదైనా కారణం చేత అగ్ని ప్రమాదం జరిగినట్టయితే వంటింట్లో ఉన్నటువంటి బేకింగ్ సోడా ను ఉపయోగించి సిలిండర్ నుంచి వచ్చేటువంటి మంటలను మరియు వాటి ప్రమాదం నుంచి ప్రాణాలను రక్షించుకోవడానికి కొరకు పలు సూచనలను చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కళాశాల సీఈవో డాక్టర్ జైపాల్ రెడ్డి గారు , దత్తాత్రి, నవీన్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, మరియు ఫైర్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి చెరువు కాలువ మరమ్మతులు చేయించండి

## ఆయకట్టు రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



రామారెడ్డి మార్చ్ 24 (ప్రజా జ్యోతి) రామారెడ్డి మండలం గొల్లపల్లి, రామరెడ్డి గ్రామాల రైతులు జిల్లా కలెక్టర్ ని కలిసిన రైతులు, భూగర్భ జలాలు అడుగంటడంతో, బోర్లు నీళ్ళు పోయాక, చెరువులో నీళ్లు లేకపోవడం వలన చేతి కింద వచ్చిన వరి పంటలు ఎండి పోవడముతో వర్షాలు లేక బోర్లలో నీళ్లు ఎండి పోవడముతో రామరెడ్డి గొల్లపల్లి గ్రామాల రైతులు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. పూర్వము నుండి సదశివనగర్ మండల పరిధిలో ఉన్న ఎల్లారెడ్డి చెరువు నుండి గొల్లపల్లి రామరెడ్డి గ్రామాల రైతుల పంట పొలాలకు సుమారు 360 ఏక రాలకు చెరువు పార్కము ఆయకట్టు ఉండేది గత 20 సంవత్సరాలుగా ఎల్లారెడ్డి చెరువు పార్కము లేక కాలువలు చెత్తాచెదారము పుడికతో కుడుక పోవడముతో ఎల్లారెడ్డి చెరువు నీళ్లు రాక ఉన్న బోర్లు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎల్లారెడ్డి చెరువు నీళ్ల కాలువల పూడిక తీసి మాకు పంటలు ఎండిపోకుండా ఈ యొక్క కాలువలు పరిశీలించి న్యాయం చేయాలని కోరిన గొల్లపల్లి, రామరెడ్డి రైతులు అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి మీకు త్వరలోనే అధికారులను పంపించి ఈ యొక్క సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి రామరెడ్డి రైతులు పాల మల్లేశ్ జీర్ల కందరి రాజయ్య, కట్లెకుంటా బాలరాజు, నేరాల చిన్న లింబద్రీ, మస్కట్ నారాయణ, కందరి లింగం, ఒద్దే బాలరాజు, మస్కట్ మల్లేశ్, చటార బోయిన రాజయ్య, అటికేల ప్రశాంత్, జీర్ల పెద్ద బయ్యన్న, జీర్ల బలనర్సింలు, ల్యాగల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# బిచ్కుంద మున్సిపాలిటీగా ఏర్పాటు పట్ల హర్షం




ప్రజా జ్యోతి జుక్కల్ ఆర్సీ మార్చి 24 జుక్కల్ నియోజకవర్గంలో మొట్టమొదటిగా బిచ్కుంద మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టపాకాయలు కాల్చి స్వీట్లు పంచారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బిచ్కుందను మున్సిపాలిటీగా మార్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, బిచ్కుంద ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు ధర్పల్లి గంగాధర్, శాఖపూర్ తుకారాం శోభన్, తక్కడపల్లి హనుమంతరావు పటేల్, నౌషా నాయక్, బిచ్కుంద గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గంప

కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి (దోమకొండ) మార్చి 24. దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సిరికొండ శంకర్ తండ్రి ఆదివారం రోజున స్వర్గస్తులైనందున సోమవారం కామారెడ్డి మాజీ శాసనసభ్యులు,మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అంబారిపేట గ్రామంలోని శంకర్ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట గ్రామ మాజీ సర్పంచ్ సలీం, పిఎసిఎస్ వైస్ ఛైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు రాజేందర్, దోమకొండ మండల యూత్ అధ్యక్షులు పాలకుర్తి శేఖర్,మండల ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్,దోమకొండ పట్టణ అధ్యక్షులు బోరెడ్డి కిషన్ రెడ్డి,నాయకులు కానుగంటి నాగరాజు,రవి తదితరులు ఉన్నారు.




## సిఈఐఆర్ ద్వారా సెల్ ఫోన్ బాధితుడికి అందజేత

పాల్వంచ ప్రజాజ్యోతి మార్చి 24.పాల్వంచ మండలం వేల్పుగొండ తండకు చెందిన విస్లావత్ బలరం మొబైల్ ఫోన్ పోగొట్టుకొని మాచారెడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సిఈఐఆర్ ద్వారా పోయిన మొబైల్ ను గుర్తించి సోమవారం బాధితుని కి అందజేసినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు ఎస్సై మాట్లాడుతూ సెల్ ఫోన్ దొరికిన వారు పోలీసులకు అప్పగించాలని సూచించారు.



### అర్ధరాత్రి ఆశాకార్యకర్తల

# ముందస్తు అరెస్టు

**నాగిరెడ్డిపేట్,మార్చి24(ప్రజాజ్యోతి):** తమ డిమాండ్ల సాధన కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను సోమవారం పోలీసులు అర్ధరాత్రే ముందస్తు అరెస్టు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చలో అసెంబ్లీకి,ఇందిరాపార్కు వద్ద ధర్నాకు బయలుదేరిన నాగిరెడ్డిపేట్ మండలంలో ఆశా కార్యకర్తలను,మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు అర్ధరాత్రి 12:30 గంటలకు వారి ఇంటివద్ద చేరుకొని ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు.ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం శాంతి యుతంగా నిరసన తెలిపేందుకు హైదారాబాద్ కు బయలుదేరే ఆశా కార్యకర్తలను అర్ధరాత్రే ముందస్తు అరెస్టు చెయ్యడం సరైంది కాదని తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్తుంటే అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తక్షణమే తమకు వేతనాలు పెంచి, తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.అరెస్ట్ అయినా వారిలో జ్యోతి,యేసుమని, సిద్దవ్వ, మారుతమ్మ,స్వప్న ఉన్నారు.

## నేడు సాటాపూర్ సంత వేలం



**రెంజల్, మార్చి 24(ప్రజాజ్యోతి):** రెంజల్ మండల కేంద్రంలోని సాటాపూర్ గ్రామంలో గల వారాంతపు సంత నేటి రోజున అనగా మంగళవారం రోజున వేలంపాట నిర్వహించడం జరుగుతుందని గ్రామపంచాయతీ కార్యదర్శి మెహబూబ్ అలీ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటాపూర్ గ్రామంలో గల వారాంతపు సంత 24వ తేదీ అనగా మంగళవారం రోజున వేలం పాట నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేశారు. ఎవరైనా ఆసక్తి కలిగిన వారు 50 వేల రూపాయలు వేలం పాటలో డిపాజిట్ పెట్టి పాల్గొనాలని ఆయన కోరారు. ఈ వేలం పాట ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయితీ ఆవరణలో ప్రారంభమవుతుందని తెలియజేశారు.

### ఆదివాసి కార్పొరేటర్ సుజాతను అవమానపరిచే విధంగా మాట్లాడిన

# ఎమ్మెల్యే సుధీర్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

### ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్ నాయక్



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి మార్చి 24.** ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదివాసి కార్పొరేటర్ అయిన సుజాత ను అవమానం చేసే పద్ధతిలో మాట్లాడి సుజాతను అవమానపరిచినందుకు ఎమ్మెల్యే సుధీర్ మాట్లాడినందుకు వారి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్ నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నునావత్ గణేష్ నాయక్ లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చట్టపరంగా , రాజ్యాంగబద్ధంగా, సుధీర్ రెడ్డి చేసిన తప్పులకు వ్యతిరేకంగా అన్ని రకాలుగా కొట్లాడుతామని సుజాత కుటుంబానికి అండగా నిలబడతామన్నారు. ఒకవైపు రాజ్యాంగపరంగా కొట్లాడుతూనే రెండోవైపు సుధీర్ రెడ్డిని రాజకీయ సమాధి చేస్తామని స్పష్టం చేశారు. సుధీర్ రెడ్డి లాంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరాడన్నారు. కుల అహంభావంతో, స్త్రీల పట్ల చులకన భావంతో, మగ దురహంకారంతో వ్యవహరిస్తున్నటువంటి వ్యక్తి చట్టసభల్లో ఉండడానికి అర్హుడు కాదని , వెంటనే అతన్ని చట్టసభలను తొలగించాలని , సుధీర్ రెడ్డి కి ఏ మాత్రం నైతిక విలువలు ఉన్న వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, రాజ్యాంగ మీద ఆయన చేసిన ప్రమాణానికి ఆయన కట్టుబడి లేదని తెలియజేశారు. ఎల్బీనగర్ ప్రజలు, రాష్ట్ర గిరిజనులు ఈ సంఘటన పట్ల స్పందించి సుజాత కుటుంబానికి ఆదివాసీ గిరిజన బంజారా లంబాడా సంఘంలు సుజాత కుటుంబానికి పూర్తిగా అండగా ఉంటామని తెలియజేశారు. గిరిజన బంజారా జాతి సుజాత కుటుంబానికి అన్నివేళలా అందుబాటులో ఉండి అండగా నిలబడతామన్నారు. త్వరలోనే జాతీయ ఎస్టీ కమిషన్ కు ఢిల్లీకి వెళ్లి కలుస్తామని అన్ని రాజ్యాంగబద్ధ సంస్థల్లో సుధీర్ రెడ్డికి వ్యతిరేకంగా కంప్లీట్ చేసి న్యాయాన్ని పొందుతామని ఆదివాసీ లంబాడా బంజారా గిరిజన నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకర్ నాయక్, బానోత్ గణేష్ నాయక్, బద్రి నాయక్, లాలూ నాయక్, సతీష్ నాయక్, మాన్య నాయక్, గిరిజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




### భరింగిడిగిలో బోర్ వేయించిన ఎంపీటీసీ పోరం మాజీ అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు

**బీర్కుర్( ప్రజా జ్యోతి) మార్చ్ 24** కామరెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలోని భరింగిడిగి గ్రామాల్లో బాన్స్ వాడ నియోజకవర్గం బీర్కూర్ మున్నూరు కాపు సంగం కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ వద్ద తన సొంత ఖర్చుతో బోరు వేయించిన ఉమ్మడి రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ రావు ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ బ్యాంక్ డైరెక్టర్ కమలాకర్ రెడ్డి వర్ని మాజీ ఎంపీపీ బధ్య నాయక్ నసుర్లా బాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందు పటేల్ , గ్రామ అధ్యక్షులు కోటగిరి గంగోండ, రెంజర్ల అనిల్, లక్కల పల్లి శ్రీనివాస్, సంగం అధ్యక్షులు నల్లీ లక్ష్మాన్, హనుమగొండ, రెంజర్ల రాజు, సురేష్, శివ, అంజయ్య, గుర్ల సుభాష్, బసయ్య,గోపి, తమ్మూర్ రవి,సుధాకర్,గంగాధర్, వర్ని టౌన్ అధ్యక్షులు మొయినుద్దిన్, వర్ని సొసైటీ డైరెక్టర్ గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో అక్రమ మొరం తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**సిపిఎం కామారెడ్డి జిల్లా కమిటీ**



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి మార్చి 24.** కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ( రెవెన్యూ ) విక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వెంకట్ గౌడ్ , కొత్త నరసింహులు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో అక్రమ మొరంతవ్వకాల జోరుగా కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు వ్యాపారులతో కలిసిపోయారని విమర్శించారు.స్పందించిన జిల్లా జైంట్ కలెక్టర్ వెంటనే ఆర్డీవోలకు ఆదేశాలిస్తూ జిల్లాలో మొరం తవ్వకాలు ఎక్కడెక్కడ జరుగుతున్న తెలుసుకొని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే కామారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల అడుగంటి పోయాయని, అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేస్తూ వ్యాపారాలు నడుపుతున్న వారి పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ప్రధానంగా బిక్నూరు, మాచారెడ్డి, రాజంపేట, బాన్సువాడ, .ఎల్లారెడ్డి, దోమకొండ, మండలాల్లో కళ్ళు ముందు తిరుగుతున్నప్పటికీ చూసి చూడనట్టు అధికారులు ఉంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మూడుచోట్ల డివైడర్లను ఏర్పాటు చేయాలి

### ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గ్రామస్థులు, వ్యాపారస్తులు

**నాగిరెడ్డిపేట్, మార్చి 24( ప్రజా జ్యోతి):** మండలంలో నూతనంగా నిర్మిస్తున్నా జాతీయ రహదారి పనులతో మండల ప్రజలు,మండల కేంద్రంలోని వివిధ రకాల వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేసి తహశీల్దార్ శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్మిస్తున్న సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ని ఏర్పాటు చేయాలని అలాగే మండల కేంద్రంలో మూడు చోట్ల డివైడర్లను ఏర్పాటు చేయాలని ఈ సమస్యను జిల్లా కలెక్టర్,ఎల్లారెడ్డి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే తహశీల్దార్ స్పందించి రహదారి ప్రాజెక్ట్ అధికారి సత్యనారాయణ తో ఫోన్ లో మాట్లాడారు దీంతో మంగళవారం గ్రామస్తుల సమక్షంలో వారి సమస్యలకు అపోహలను పరిష్కరిస్తామని తెలిపారు.

